# పిచ్చివాడు

రచన: ఆకెళ్ళ సూర్యనారాయణ

"జ్ఞాపకం ఉన్నానా!"—"సూ"-ని చూడ్డతోనే-"ల"—వేసిన మొదటి ప్రశ్న ఇదే. బాణంలా గుచ్చుకొంది "సూ"కి ఈమాట. తన హృదయంకేసి చేతినిజూపి "దానిని అడుగు తెలుస్తుంది" అన్నాడు. మరుక్షణంలో వారిద్దరూ నవ్వుకున్నారు కాని హృదయవేదనా భరితమైనదా నవ్వు.

"సూ"కి భగవంతుడు మూడు గీతల్లోను కూడా ఈశ్వర్య జూపించేడు. ఆ సంగతి "సూ"కి తెలియదు. తానెప్పటికైనా సుఖిస్తాననే అతని ఊహ. ఎదటి హృదయము నిష్కలంక మనుకుంటాడు. అంచేతే ఐనవాళ్లు అకారణముగా అతనిని ద్వేషిస్తారు. ఎందుచేతనో? యెక్కడి కక్కడే సర్దుకోబోతాడు. ఈ సర్దుకోవడము వారికి యెక్కువ అపకారము జేస్తుంది గాబోలు, ద్వేషము ద్విగుణీకృతము అవుతుంది. తన పల్లెటూరి బడిపంతుల పనికే తృప్తి పడతాడు. తన స్వల్ప జీతములోనుంచే ఏదో కొంత మిగల్చడానికని ప్రయత్నిస్తాడు. అలుముకున్న అప్పులు యితని జేబు ఖాళీచేస్తూ ఉంటారు. ఆ వేసవి శలవులకు దూరముగాఉన్న స్వగ్రామము జేరేడు. ఉద్యోగపు ఊళ్లోకంటె యిక్కడ ఏదో సుఖిద్దామని గాబోలు అతని ఊహ!

"శే" ఈ అభాగ్యుడికి సహధర్మచారిణి ఐంది. పల్లకి యెక్కితే గౌరవము లభిస్తుందనే వయస్సులోనే "సూ"కి "శే" వచ్చింది. పినతండ్రి అరుపుల్లోను, తల్లి కన్నీటిలోను, బంధువుల బెదిరింపులలోను మూగవాడై పోయేడు. తనకీ చిన్నతనములో వివాహము ఏమిటని చెప్పటానికి భయపడ్డాడు. పాపం "శే" కి నచ్చతే దని పల్లెటూరిపిల్ల భర్తను ఏవిధముగా లోబరచుకోవాలో తెలియదు. వంశ పారంపర్యముగా వచ్చే తండ్రిగారి హక్కు భుక్తములో ఉన్న "పట్టుదలను" మాత్రము జీర్ణము చేసుకొంది; దానితోటే భర్తను లోబరచుకోవాలనుకుంటుంది. పిచ్చిపిల్ల యెరుగదు దానివల్ల అకారణముగా భర్త మనస్సులోని తనమీద అసహ్య[illegible] చాలాబాధ పడతాడని.

అన్నివిధాలా భర్తకు అనుగుణ్యముగా ఉండాలనే జూస్తుంది. ఆమె ఉద్దేశాలకంటె పట్టుదలే ముందు నడచి భర్త ప్రేమకు దూరము జేస్తోంది.

"ల" సుకుమార హృదయ. అందాల రాణి; కాని అభాగిని "సూ"ని చిన్నతనమునుంచి ఎరుగును. అమాయికముగా ప్రేమించింది "సూ"ని దూరపు బంధువుల అమ్మాయి.

చిన్నతనమునుంచి వేసవికాలపు శలవులకు బంధువుల ఇంట్లో కలవటము అలవాటు ఇద్దరకూ.

ఆడుకొనేటప్పుడు ఇద్దరూ పోట్లాడుకొనేవారు. కాని ఒకళ్లపైన ఒకళ్లకు ద్వేషము లేదు. ఎవరికి బాధగా ఉంటుందో! అనే రెండవవారి భయము. "ల"ను అక్కగారు అడిగేది. ఏమే బావను పెండ్లాడతావా? అని ఎందుచేతనో ఒక్కసారిగా బావ మొహములోకి జూసి నవ్వేది. వెంటనే 'నేను పెళ్ళాడను బాబు! బావ కొడతాడు.' అనేది ఈ మాట వింటే "సూ"కి యెక్కడలేని ఉడుకు మోత్తనము వచ్చేది. ఇంకెప్పుడూ 'ల'తో మాట్లాడకూడదనుకొనేవాడు మరో కాస్సేపటికి యెక్కడినుంచో 'ల' వచ్చి మూతి బిడాయించుకున్న "సూ" మొహములోకి మొహము పెట్టి, ఏంబావా! కోపం వచ్చిందా! నాతో మాటాడవ్. పోనీ! అని దీనముగా అడిగే సరికల్లా కోపమంతా ఎక్కడికి పోయేదో!

కాలము గిర్రునతిరిగింది. "ల"కు పుస్తెకట్టిన అల్పాయుష్కుడు పెండ్లి ఐన నాలుగుమాసములు తిరక్కుండానే, "ల"కు తొమ్మిదో యేటనే తాను కట్టిన పుస్తె తెంపేసేడు.

"ల"-"సూ" లు అనేకమార్లు కలుసుకున్నారు. వారిలో ఏదో హృదయాన్ని ఛేదించే వేదన ఉండేది. అది వారికండ్ల చూపుల్లోనే ద్యోతకమౌతుండేది. పక్వముకాని వారి ప్రేమఫలము, అంతకంటె యెక్కువగా పరిమళించలేదు అప్పట్లో.

ఆ శలవుల్లో పెండ్లిలో కలుసుకున్న "ల" "నూ"ల ప్రేమఫలము పండి పరిమళము గుప్పున ఒండొరుల ముఖాన కొడుతోంది. వారిచూపులు సంఘముచే తమకు గావింపబడిన అన్యాయానికి దురపిల్లుతున్నాయి.

పెండ్లితంతు ప్రారంభించేడు పందిట్లో పురోహితుడు. బాజా భజంత్రీలు మధ్య మధ్య 'ఆగండోయ్' అన్న కేకకు ఆగిపోతున్నారు.

'ల' ఎచ్చటా పందిట్లోలేదు. ఆడవారి గుంపునంతా వెతికేయి 'నూ' కళ్ళు లోనికి వెళ్ళేడు. ప్రక్కగదిలోకి అడుగుబెట్టేడు మంచముపైని వెక్కివెక్కి ఏడుస్తోంది 'ల'. నిర్ఘాంతపోయేడు. దగ్గరకు వెళ్ళేడు. ఏమనాలో తెలిసిందికాదు 'నూ'ని చూడ్డంతోనే 'ల'కు దుఃఖము పొర్లివచ్చింది. 'నూ'ని బ్రతిమాలాడు ఏదో చాతనయినట్టు బుజ్జగించేడు; తనతో పందిట్లోకి రమ్మన్నాడు రాలేనంది. 'నువ్వు రాకపోతే నేనూ వెళ్ళను అక్కడకు' అన్నాడు. 'నూ' మొహములోకి చూచింది; ఏమనుకుందో! కన్నీటిని తుడుచుకొంది ముందు 'నూ' వెనుక 'ల' వచ్చేరు పందిట్లోకి.

కిటికీలో 'నూ'కి కనిపిస్తూ కూర్చుంది. పందిట్లో ఏమి జరుగుతోందో, వాళ్ళకు తెలియలేదు. వాళ్ళ హృదయాలలోని బాధమాత్రము పరస్పరము చూచుకుంటున్నారు.

కిన్నెరస్వరముతో మేళవించి పాడగలదు 'ల' ఆమె పాటకు గాళ్ళు కరుగుతాయి. 'నూ'పాడమంటే 'ల' కు యెక్కడలేని సంతోషము ఉత్సాహం వస్తాయి. ఆమె పాడుతూ ఉంటే తన్మయుడవుతాడు. పాట అయిన తరువాత ఒండొరులను చూచుకొని, చిరునవ్వు నవ్వుకునేవారు; వెంటనే హృదయంలోంచి వచ్చేది బాధతో నిట్టూర్పు.

ఆ పెండ్లిలో వారు విడిగాలేరు. ఒండొరులు ఎదురుగా కూర్చుంటే గంటలు నిముషాలుగా నడచేవి.

"అ"-"ల"కు ఒక అప్పగారు వారిని పసికట్టింది కాబోలు, "ల"ను దూరంగా ఉంచటానికి ప్రయత్నించేది. కాని ఆమెను తప్పించుకొని తిరిగేవారు. వారి హృదయాలలోని బాధంతా జెప్పుకొని, హృదయబరువు కొంత తగ్గించుకున్నారు. తమకు జరిగిన అన్యాయానికి దుఃఖించేరు.

ఆరాత్రి ఊరేగింపు; పెళ్ళివారంతా ఊరేగింపుకు వెడతారు. "ల" ఊరేగింపుకు వెళ్ళకూడదు. "సూ" ని అడిగింది. నువ్వుకూడా ఊరేగింపుకు వెడతావా! "ల" మొహంలోకి చూసేడు "నూ". ఆమె ముఖములో ఏదో బాధతో "నువ్వు వెళ్ళవద్దు." చెప్పినట్లయింది.

"వెళ్ళను" అన్నాడు "నూ"

"ల" గదిలో మంచముపై పడుకుంది. "నూ" కూడా వెళ్ళేడు. గదిలోనికి "ల" మొహములో హృదయావేదన ఉంది.

'ల' అని పిలిచేడు 'నూ' తన రెండుచేతులతోను 'ల' చేతులను పట్టుకుంటూ.

"బావా!" గద్గదంగా ఒణుకుతూ జవాబిచ్చింది.

ఒండొరులు ముఖాలలోనికి బాధతో చూచుకున్నారు. వారికండ్లు తాగినవారి కండ్లలాగ ఎర్రబడ్డాయి.

అప్రయత్నముగా 'ల' చేతులను ఎత్తి తన మెడకు పెనవేసుకున్నాడు. తరగడాలలో ఇమిడిన ఆమె ముఖమును తనవైపు రెండుచేతులలోను ఇమిడ్చి తన ముఖమును వంచేడు.

వారి పెదవులు దేనినో కాంక్షిస్తున్నాయి. నిట్టూర్పులు వారిద్దరి ముఖాల మధ్య బంధించబడ్డాయి.

నాగవిల్లి అయింది. భోజనాలు అయ్యేయి. 'ల' వెళ్ళిపోతుంది. వారిద్దరకు ప్రపంచములో ఇక ప్రేమించతగ్గ వస్తువులేదు. కన్నీరంతా ఎప్పుడు పైకి వద్దామా! అని కొలకుల్లోంచి తొంగి చూస్తోంది.

బండి వచ్చింది. 'ల' వెడుతుంది. 'నూ' కని చూచింది. గదిలోనికి వెళ్ళింది. అనుసరించేడు 'నూ' సావిట్లో అప్పగింతలు జరుగుతున్నాయి.

ఆడ పెళ్ళివారికి కన్నీరు చెక్కిళ్లమీద నుంచి జారుతోంది.

'వెళ్ళిరమ్మన్నావా! బావా!' 'నూ' కండ్లలోకి అనురాగముగా చూస్తూ, కన్నీటిని కొలకులలోకి వంచుతూ అంది; ల.

'నూ' కండ్లలో చీకటి కనిపిస్తోంది. శరీరం గిర్రున తిరుగుతోంది. వారిద్దరి మధ్యా 'శే' బంధువులు కలసి అన్యాయము అంటూ అరుస్తున్నట్టు తోచింది.

'ల' రెండుచేతులను 'నూ' పట్టుకున్నాడు. ఆ చేతులను తన హృదయానికి అన్చుకున్నాడు.

'శే'కి అన్యాయము చేయటములేదా! 'శే'కి ఇచ్చిన హృదయముమీద, 'ల' చేతులను ఉంచవచ్చా? మోసముగాదూ! అసలు 'శే'కి హృదయము ఇచ్చినా! తన హృదయములో 'శే' కన్పించలేదు. అంతటా 'ల' మాత్రము ప్రతిఫలిస్తోంది.

ఇద్దరు ఒకే అవస్తలో ఉన్నారు.

'బావా! ఈ అభాగినిని మాత్రము మరచిపోక,–,ఇంకా ఏదో జెప్పబోయింది. ఇంతలోకే 'ల' అనే పిలుపుతో 'ల' తన అమృతహస్తాలను 'నూ' హృదయముమీదనుంచి మెల్లిగా, బాధతో తీసుకొని, పైటచెరగుతో కన్నీటిని తుడుచుకుంటూ 'నేను వెడుతున్నాను. నా హృదయము మాత్రము, నీ హృదయములో దాచుకున్నా అన్నట్టు వెనుతిరిగి చూస్తూ' దీనముగా గది దాటింది.

'నూ'కి ఇక వాస్తవములో అంతాశూన్యమే. ఎదురుగానిల్చుని 'శే' "ఏమిటి మీఊహ నన్నేం జేద్దామని" అంటోంది.

"జాగ్రత్తఏమాత్రమైనా తొందరపడ్డావా! నీపని చెప్తా"నంటోంది సంఘము.

'నీకు నీవే, మాకు మేమే' అంటున్నారు, బంధువులు.

"తన హృదయాన్నంతా నీ హృదయములో అమాయికముగా దాచుకున్న 'ల'హృదయాన్ని దొంగిలి అన్యాయము జేస్తావా!" అంటోంది. 'నూ' హృదయము.

ఏమీతోచక 'శే' బంధువులు, 'ల' హృదయమూ అంటూ పిచ్చికేకలు వేస్తున్నాడు 'నూ' పాపంపిచ్చివాడు.




## ఆరోగ్యజీవనము

### మీ అందుబాటులోనే వుంది

మనం ప్రకృతికి దూరమౌతున్నాము
అటులనే ఆరోగ్యానికినీ

కాని, గృహిణి ఆరోగ్యముగ వుండనియెడల మొత్తము గృహమే అనారోగ్యమై అనాకర్షవంతమై వుంటుంది. స్త్రీ ఆరోగ్యమును ఏ పరిస్థితులందైనను కాపాడుకోవాలి. స్త్రీకి ఆరోగ్యజీవనము అందుబాటులోనే వుంది.
"లోధ్ర" స్త్రీలకు ఆరోగ్యజీవనమును ప్రసాదిస్తుంది. లోధ్ర సేవనము గర్భాశయ రోగములను నిర్మూలించి సౌందర్య సౌఖ్యజీవనమును ప్రసాదిస్తుంది.

సుదతుల సౌఖ్య సౌందర్య జీవనమునకు

## లోధ్ర

కేసరి కుటీరం లిమిటెడ్., మద్రాసు.

తెలుగుజిల్లాలకు, నైజాముకు ఏజెంట్లు:
సీతారాం జనరల్ స్టోర్సు, బెజవాడ.